

శ్రామికశక్తికి జై

కష్టాన్ని నమ్ముకొని చెమటచుక్కలు చిందిస్తున్నారు.. అయినా శ్రమ దోపిడీకి గురవుతూ బతుకుపోరాటం సాగిస్తున్నారు. 12లో▸



భావితరాలకు స్ఫూర్తి

దివంగత ప్రధాని వాజ్‌పేయి జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. 12లో▸



రోడ్డు పనులు అడ్డుకున్న..

సీసీ రోడ్డు పనులు అడ్డుకున్న వ్యక్తికి నోటీసులు అందజేసిన ఘటన సంగెం గ్రామంలో చోటుచేసుకుంది. 12లో▸

న్యూస్‌రీల్

ధ్యానంతో ఆరోగ్యకర జీవనం



ఆవులకు ఆహారం పెడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నందిగామ: ధ్యానంతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమ్లేష్ డి.పటేల్ ఆధ్వర్యంలో కన్హా శాంతివనంలో కొనసాగుతున్న బాబూజీ మహరాజ్ జయంతి వేడుకలకు బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. నిశ్శబ్దం అరుదైన విలాసమని తెలిపారు. కన్హా శాంతివనం ఆహ్లాదకరంగా, అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. అంతకు ముందు గురూజీతో కలిసి ధ్యానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కూచిపూడిలో చైత్ర ప్రతిభ



గిన్నిస్ వరల్డ్ రికార్డు పత్రాన్ని అందుకుంటున్న చైత్ర

చేవెళ్ల: కూచిపూడి నృత్య ప్రదర్శనలో చేవెళ్ల ప్రాంతానికి చెందిన విద్యార్థిని గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. నగరంలోని రవీంద్రభారతిలో మంగళవారం రాత్రి జరిగిన కృషి నాట్య అకాడమీ కల్చరల్ మీట్, గిన్నిస్ వరల్డ్ రికార్డు సక్సెస్ మీట్‌లో విద్యార్థిని చట్లపల్లి చైత్రకు నాట్య గురువు కాంతారావు, నటసాయి చేతుల మీదుగా రికార్డు పత్రాన్ని అందజేశారు. మండలంలోని ఖానాపూర్‌కు చెందిన చైత్ర 2023 డిసెంబర్ 24న భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో వేలమందితో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శన గిన్నిస్ రికార్డు సాధించిందని అప్పట్లో ప్రకటించారు. ఈ మేరకు రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అందులో పాల్గొన్న వారిలో ఎంపిక చేసి గిన్నిస్ రికార్డు పత్రాలను ప్రదానం చేశారు. తమ కూతురికి గుర్తింపు రావటం సంతోషంగా ఉందని చైత్ర తల్లిదండ్రులు పేర్కొన్నారు.

నళినీ పద్మావతికి హౌసింగ్ బాధ్యతలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ నళినీ పద్మావతికి హౌసింగ్, హెరిటేజ్ విభాగాల బాధ్యతలప్పగించారు. చాలా రోజులుగా పోస్టింగ్ కోసం ఆమె వెయిటింగ్‌లో ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో ఇప్పటి వరకు ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదు. పాత కమిషనర్ ఇలంబర్తి జీహెచ్‌ఎంసీ నుంచి రిలీవ్ అయ్యేముందు ఈమేరకు పోస్టింగ్ ఇచ్చిన విషయం ఆలస్యంగా తెలిసింది. ప్రస్తుతం అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు వద్ద హౌసింగ్‌తో పాటు పలు విభాగాల బాధ్యతలుండటం తెలిసిందే.

పదిలో పల్టీ

రాష్ట్రంలో.. 31వ స్థానం

- పదో తరగతి ఫలితాల్లో వెనుకబాటు
- గతేడాదితో పోలిస్తే 3.17 శాతం తగ్గుదల
- రాష్ట్రంలో 31వ స్థానంలో నిలిచిన జిల్లా

పరీక్షకు హాజరైన విద్యార్థులు	51,671
ఉత్తీర్ణులైనవారు	45,386
శాతం	87.84
బాలికలు	24,658
శాతం	89.65
బాలురు	23,281
శాతం	86.18

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి ఫలితాల్లో జిల్లా పల్టీ కొట్టింది. 2024లో సాధించిన ఫలితాలతో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం 3.17 తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో జిల్లా 31వ స్థానంలో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా 51,671 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరు కాగా, వీరిలో 45,386 మంది ఉత్తీర్ణత (87.8శాతం) సాధించారు. ఎప్పటిలాగే బాలురతో పోలిస్తే బాలికలే పైచేయి సాధించారు. 27,013 మంది బాలురు పరీక్ష రాస్తే 23,281 మంది ఉత్తీర్ణత (86.18శాతం) సాధించారు. 24,658 మంది బాలికలు పరీక్ష రాయగా, 22,105 మంది ఉత్తీర్ణత (89.65శాతం) సాధించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులతో పోలిస్తే అర్బన్ ఏరియాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారు అధికంగా ఫెయిలయ్యారు. సబ్జెక్టు టీచర్లు లేకపోవడం.. ఉన్నచోట వేళకు స్కూలుకు రాకపోవడం.. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించకపోవడం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వెరసి ఫలితాల్లో వెనుకబాటుకు ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



నిఖిల్, 580



జె.విఘ్నేశ్, 574

100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు

జిల్లాలో 18 ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. వీటిలో రాజేంద్రనగర్‌లోని ఎంజేపీటీబీసీ డబ్ల్యూఆర్ బాలికల స్కూల్ సహా కిస్మత్‌పూర్‌లోని కేజీబీవీ బాలికల పాఠశాల, రాజేంద్రనగర్‌లోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, ఇబ్రహీంపట్నం నల్లకంచలోని బాలికల సాంఘీక సంక్షేమ స్కూల్, గౌలిదొడ్డిలోని బాలికల సాంఘీక సంక్షేమ స్కూల్, అబ్దుల్లాపూర్‌మెట్ జెడ్పీ హైస్కూల్, కవాడిపల్లి జెడ్పీ హైస్కూల్, బాటసింగారం జెడ్పీ హైస్కూల్, మజీద్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్, బండరావిర్యాల జెడ్పీ హెచ్‌ఎస్, కొకుంట్ల జెడ్పీ హైస్కూల్, ఎలిమినేడు జెడ్పీహెచ్‌ఎస్, ఇబ్రహీంపట్నం బాలికల జెడ్పీ హైస్కూల్ (ఉర్దూ మీడియం), మంచాల బాలికల జెడ్పీహెచ్‌ఎస్, జెడ్పీ హెచ్‌ఎస్ చెన్నారెడ్డిగూడెం, మేకగూడ జెడ్పీ హైస్కూల్, వెల్జాల జెడ్పీహెచ్‌ఎస్, యాచారంలోని చిన్నతూండ్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఆయా పాఠశాలలకు జిల్లాలోనే ఉత్తమ గుర్తింపు లభించింది.

6,285 మంది ఫెయిల్

మొత్తం 51,792 మంది వార్షిక పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 121 మంది వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో 3,732 బాలురు, 2,553 మంది బాలికలు ఫెయిలయ్యారు. వీరిలో జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులే (3,320 మంది) అధికంగా ఉన్నారు. ఇక ప్రైవేటు పాఠశాలల్లో 2,335 మంది పరీక్ష తప్పారు. పరీక్షలో ఫెయిలైయిన వారిలోనూ బాలురే ఎక్కువగా ఉన్నారు. మెజార్టీ విద్యార్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారిలో 19 మంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.

మేనేజ్‌మెంట్ వారీగా ..

జిల్లా పరిధిలో మేనేజ్‌మెంట్ వారీగా పరిశీలిస్తే జెడ్పీ 71.65, ప్రభుత్వ 65.31, మోడల్ 84.80, కేజీబీవీ 75, ఎయిడెడ్ 87.18, ఆశ్రమ పాఠశాలలు 76.60, బీసీ సంక్షేమ పాఠశాలలు 95.24, ప్రైవేటు 93.14, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు 91.87, సాంఘిక సంక్షేమ 94.97, గిరిజన సంక్షేమ విద్యా సంస్థలు 93.68 శాతం చొప్పున ఉత్తీర్ణత సాధించాయి.

రెండేళ్లలో ఉత్తీర్ణత శాతం..

సంవత్సరం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2024	50,811	46,245	91.01
2025	51,671	45,386	87.84



కొందుర్గులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

'భూభారతి'తో పరిష్కారం సులభం

కలెక్టర్ నారాయణరెడ్డి

కొందుర్గు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం ద్వారా భూ సంబంధిత సమస్యలన్నీ పరిష్కరించుకోవడం సులభతరమని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. కొందుర్గులో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ధరణి పోర్టల్‌తో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ముందుగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం జిల్లాకు ఓ మండలాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. మన జిల్లా నుంచి కొందుర్గును ఎంపిక చేశామని, మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలన్నీ పరిష్కరించి రోల్‌మోడల్‌గా నిరూపించాలన్నారు. గ్రామాల్లోకి అధికారులు వచ్చి సదస్సులు నిర్వహించిన సమయంలో గ్రామస్తులు సహకరించాలన్నారు. రాబోయే రోజుల్లో రైతులకు భూధార్‌కార్డు అందించడం జరుగుతుందని, దీంతో భూ సంబంధిత అన్ని వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల బాధలు తెలిసిన నాయకుడని, రైతుల సమస్యలన్నీ పరిష్కరిస్తున్నారని కొనియాడారు. అనంతరం ధరణితో ఇబ్బందులు పడ్డ రైతుల అభిప్రాయాలను సేకరించారు.

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో..

జిల్లేడ్‌చౌదరిగూడ మండలంలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఆయా మండలాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆర్డీఓ సరిత, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన, వైస్ చైర్మన్ బాబార్‌ఖాన్, ఏడీఏ రాజారత్నం, తహసీల్దార్లు రమేష్ కుమార్, జగదీశ్వర్, ఎంపీడీఓలు లక్ష్మిఅనురాధ, ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కృష్ణా రెడ్డి, కావలి రాజు పాల్గొన్నారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి

శంకర్‌పల్లి: రానున్న వానాకాలం దృష్ట్యా డీలర్లు విత్తనాలను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు సూచించారు. పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. డీలర్లు పక్కాగా రిజిస్టర్లు, రికార్డులు నిర్వహించాలని, విత్తనాలు అమ్మిన తర్వాత రైతులకు రసీదులు ఇవ్వాలని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న రోజుల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై ముమ్మర తనిఖీలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఓ సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



వివాహ వేడుకలో సీఎం

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ సమీపంలోని పీవీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన వివాహ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన తూర్పు సరళ, అచ్యుత్‌రెడ్డి కుమారుడు ఆదిత్యరెడ్డి వివాహం బాకారం గ్రామానికి చెందిన రమ, చంద్రశేఖర్ దంపతుల కుమార్తెతో జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

బసవేశ్వరుడి మార్గం అనుసరణీయం

షాబాద్: సమాజంలో అస్పృశ్యత నివారణకు మహాత్మా బసవేశ్వరుడు ఎంతో కృషి చేశారని రాష్ట్ర హాకీ చైర్మన్ కొండ విజయకుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం బసవేశ్వరుని జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బసవేశ్వరుడు ఆనాడే అనుభవ మంటపం స్థాపించి కులమతాలకు అతీతంగా అందరికీ సమాన హక్కులు కల్పించారని కొనియాడారు. దళితులకు ఆలయ ప్రవేశం కల్పించి, సహపంక్తి భోజనాలు నిర్వహించారన్నారు. స్త్రీలకు సమాన హక్కులు కల్పించారని గుర్తు చేశారు. బసవేశ్వరుడు చూపిన మార్గం అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సభ్యులు లింగప్ప, మల్లికార్జున్, సుధీర్, జ్యోతి, పర్షవేది, వీరేశ్, రాజేష్, శ్రావణ్, జగదీష్, దీపక్, విశ్వనాథ్, సర్వేశ్ తదితరులు పాల్గొన్నారు.



బసవేశ్వరుడి చిత్రపటం వద్ద నివాళి

ప్రభుత్వ భూముల జోలికి రావద్దు

మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్



పెద్దమంగళారం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన అక్రమ ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న అధికారులు

మొయినాబాద్: ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూ సర్వే నంబర్ 218లో రెండెకరాల ప్రభుత్వ భూమి చుట్టూ అక్రమంగా నిర్మించిన ఫెన్సింగ్, టిఫిన్ సెంటర్ డబ్బాలను బుధవారం రెవెన్యూ అధికారులు జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా ప్రభుత్వ భూముల జోలికొస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రజలు సైతం రెవెన్యూ అధికారులకు సహకరించాలని, ఈ విషయాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ భూమి చుట్టూ అక్రమంగా ఫెన్సింగ్ వేసినవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కూల్చివేతల్లో ఆర్ఐ రోజా, సిబ్బంది బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

జూన్ 26 నుంచి బోనాలు

లక్డీకాపూల్: తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. నగరంలో జూన్ 26 నుంచి బోనాల సందడి మొదలు కానుంది. ప్రతి ఏడాది ఆషాఢ మాసం తొలి గురు లేదా ఆదివారంతో బోనాలు ప్రారంభమవుతాయి. గోల్కొండలోని జగదాంబిక మహంకాళి అమ్మవారికి ప్రభుత్వం తొలి బోనం సమర్పిస్తుంది. ఆ తర్వాత రెండో బోనం బల్కంపేట రేణుక ఎల్లమ్మ గుడిలో, మూడో బోనం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ఎత్తుతారు. మళ్లీ గోల్కొండలోని చివరి బోనంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఏడాది ఆషాఢమాసం ప్రారంభమైన తర్వాత జూన్ 26న గురువారం తొలి బోనంతో ప్రారంభమై జూలై 24న గురువారం తుది బోనంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

భావితరాలకు స్ఫూర్తి వాజ్‌పేయి


నాగారంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఎంపీ ఈటల రాజేందర్

మహేశ్వరం: దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మండల పరిధిలోని నాగారంలో బీజేపీ మండల అధ్యక్షుడు యాదీష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వాజ్‌పేయి సంస్మరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. దేశం క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు వాజ్‌పేయి తీసుకున్న నిర్ణయాలు జాతిని ముందుకు నడిపించాయని గుర్తుచేశారు. దేశంలో సుస్థిర, సుపరిపాలన అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ మిద్దె సుదర్శన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, రాష్ట్ర నాయకులు జయప్రకాశ్, కాశీనాథ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

పలువురికి తీవ్రగాయాలు


ప్రమాదానికి కారణమైన కారు

అబ్దుల్లాపూర్‌మెట్: ఓ కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా కారును నడుపుతూ అతి వేగంగా వచ్చి రోడ్డుపై అలజడి సృష్టించాడు. మరో కారుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గచ్చిబౌలి గోపన్‌పల్లిలో నివాసముండే ముత్తవరపు వెంకటరమణ తన భార్యతో కలిసి బుధవారం ఉదయం 11గంటలకు తమ బెలోనో కారులో సొంతూరు సూర్యాపేట జిల్లా కోదాడకు వెళ్తున్నారు. మార్గమధ్యలో పెద్ద అంబర్‌పేట ఔటర్ రింగ్‌రోడ్డు కూడలి దాటిన తర్వాత చౌటుప్పల్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న క్రెటా కారు డ్రైవర్ అతి వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న కారుతోపాటు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. ఈ ఘటనలో వెంకటరమణతో పాటు అతని భార్య ప్రదీపకు, ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న లింగస్వామి, అతని భార్య నవనీత వారి ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. వీరితో పాటు మరో యాక్టీవ వాహనంపై వెళ్తున్న మల్లారెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డు మృతి కేసులో ముగ్గురికి రిమాండ్

యాచారం: హోంగార్డు మృతి కేసులో బుధవారం యాచారం పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. మండల పరిధిలోని గునుగల్‌లో రెండు రోజుల క్రితం డ్రైనేజీ కాల్వ నిర్మాణ విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈనేపథ్యంలో తీవ్ర అస్వస్థతకు గురైన హోంగార్డ్ వెంకటేశ్‌కు ఛాతిలో నొప్పితో రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. ఈ కేసులో గునుగల్‌కు చెందిన పవన్, ప్రశాంత్, యాదమ్మను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

శ్రామికశక్తికి జై

- రెక్కలు ముక్కలు చేసుకుని..
- చెమట చుక్కలు చిందిస్తూ..
- ప్రాణాలను పణంగా పెట్టి..
- పరిశ్రమల్లో శ్రమదోపిడీకి గురవుతూ..
- కష్టాల కడలిలో శ్రమజీవుల బతుకులు
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం


ఓ పరిశ్రమలో రక్షణ కవచాలు లేకుండా పని చేస్తున్న కార్మికులు (ఫైల్)

షాద్‌నగర్: వారిబలంతో కొండలనైనా కరిగిస్తారు.. నిరంతరం శ్రమనే నమ్ముకుని లక్ష్యం సాధిస్తారు.. కాలుష్యపు కోరల్లో, కఠోరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.. అర్ధాకలికి అలమటిస్తూ.. శ్రమదోపిడీకి గురవుతున్నారు.. పారిశ్రామిక రథచక్రాలను తమ భుజస్కందాలపై నడిపిస్తున్నారు.. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా అధిగమిస్తూ తమదైన పంథాలో ముందుకు సాగుతున్నారు.. కష్టాన్ని నమ్ముకొని చెమటచుక్కలు చిందిస్తున్నారు.. బతుకుపోరాటం సాగిస్తున్నారు కార్మికులు.. నేడు కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

యంత్రాల మధ్య నలుగుతున్న జీవితాలు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉపాధి కల్పించే పరిశ్రమలు కార్మికుల ఉసురు తీస్తున్నాయి. పారిశ్రామిక వాడలను నమ్ముకొని, కుటుంబాలను వదిలి.. ఒంటరిగా కొందరు.. కుటుంబాలతో మరికొందరు వలస వస్తున్నారు. సలసలమండే నిప్పుల కొలిమిలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తిస్తున్నారు. ఎప్పటికైనా కష్టాల నుంచి గట్టెక్కుతామన్న ఆశతో పని చేస్తున్న శ్రమజీవులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. వేతనాలు సరిగా లభించక శ్రమదోపిడీకి గురవుతున్నారు. రక్షణ కవచాలు అందించకపోవడంతో చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. పరిశ్రమల యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా యంత్రాల మధ్య నలిగిపోతున్నారు. జిల్లా పరిధిలో నాలుగేళ్లలో వందల మంది కార్మికులు ప్రమాదాల బారిన పడ్డారు. ఒంటరిగా వచ్చి మృత్యువాత పడిన అనాథశవాలకు స్థానికులు అంత్యక్రియలు నిర్వహించిన సంఘటలు ఉన్నాయి.

కన్నెత్తి చూడని అధికారులు

పరిశ్రమల్లో కార్మికులు అవస్థలు పడుతున్నా, యాజమాన్యాల నిర్లక్ష్యానికి గురవుతున్నా కార్మిక శాఖ అధికారులు మాత్రం కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. పరిశ్రమ యాజమాన్యాల మామూళ్లకు తలొగ్గుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పరిశ్రమలో ప్రమాదవశాత్తు ఎవరైనా కార్మికుడు మరణిస్తే వారి కుటుంబాలకు సరైన పరిహారం కూడా అందడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులు, మృతుల కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాల నేతలంతా ఏకమై నినదిస్తే కంటితుడుపు చర్యలతో సరిపెడుతున్నారు.

జిల్లాలో పరిశ్రమలు ఇలా..

జిల్లాలో భారీ, మధ్య తరహా, చిన్న పరిశ్రమలు సుమారు 3,474 ఉన్నాయి. వీటిలో మైక్రో పరిశ్రమలు 2,182, చిన్నతరహా 1,094, మధ్య తరహా 62, భారీ 103, మెగా 9, మెగా ఇన్‌ఫ్రా పరిశ్రమలు 24 వరకు కొలువుదీరాయి. ఇందులో బిహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, ఏపీ తదితర రాష్ట్రాలకు చెందిన సుమారు 35వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. 80శాతం మంది వలస కార్మికులు ఉన్నారు. 70 శాతం మంది కాంట్రాక్టు కార్మికులు, 30 శాతం మంది రెగ్యులర్ ఉద్యోగులు పరిశ్రమల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

చట్టాలను పునరుద్ధరించాలి



కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించాలి. రెక్కాడితే కాని డొక్కాడని కార్మికులకు ప్రభుత్వాలు అండగా నిలవాలి. వారి సంక్షేమం కోసం పాటుపడాలి.

– పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



ఎంతో మంది తమ ప్రాణాలు అర్పించి ఎనిమిది గంటల పని విధానాన్ని సాధించుకున్నారు. చాలా పరిశ్రమల్లో శ్రమదోపిడీకి గురవుతున్నారు. కార్మికుల సంక్షేమానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.

– ఎస్.రాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

దంత వైద్యుడి ఆత్మహత్య

కుటుంబ కలహాలే కారణం


మహర్షి (ఫైల్)

షాద్‌నగర్: కుటుంబ కలహాలతో షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఓ వైద్యుడు బుధవారం హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సాయిబాబా కాలనీకి చెందిన కొమ్ము వెంకన్నబాబు మూడో కుమారుడు డాక్టర్ మహర్షి (35) తన భార్య డాక్టర్ రజితతో కలిసి బేగంపేటలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. భార్యాభర్తలు ఇద్దరూ డెంటిస్ట్‌లే. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన మహర్షి బుధవారం నగరంలోని ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్‌కు తరలించే ఏర్పాట్లలో ఉన్నట్లు తెలిపారు.

గోల్ఫ్ అసోసియేషన్ కేసు సీసీఎస్‌కు బదిలీ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్‌లో (హెచ్‌జీఏ) నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి గోల్కొండ ఠాణాలో నమోదైన కేసు దర్యాప్తు నిమిత్తం సీసీఎస్‌కు బదిలీ అయింది. అసోసియేషన్‌కు చెందిన సీనియర్ సభ్యుడి ఫిర్యాదు మేరకు ఈ నెల 16న గోల్కొండ ఠాణాలో ఈ కేసు నమోదైంది. రూ.1.7 కోట్లకు సంబంధించిన కాంట్రాక్టును అవసరమైన విధానాలు పాటించకుండా కట్టబెట్టారని, రూ.50 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించారనేది ప్రధాన ఆరోపణ. ఇందులో హెచ్‌జీఏ ప్రెసిడెంట్, సెక్రటరీ సహా కీలక సభ్యులపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో దీని దర్యాప్తును సీసీఎస్‌కు అప్పగిస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. గోల్కొండ ఠాణా నుంచి వచ్చిన కేసును రీ–రిజిస్టర్ చేసిన సీసీఎస్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

దాడి కేసులో ఒకరికి ఏడాది జైలు

కొడంగల్: మండల పరిధిలోని బూల్కాపూర్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి కొడంగల్ మున్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఏడాది జైలు శిక్ష విధించారు. 2020లో జరిగిన ఇంటి గొడవలో శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డిపై అప్పటి ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న తర్వాత కొడంగల్ కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. శ్రీనివాస్‌రెడ్డి తలపై రాడ్డుతో కొట్టి దాడి చేసినందుకు సత్యనారాయరెడ్డికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

దాడి కేసులో వ్యక్తికి రిమాండ్

యాచారం: ఓ మహిళపై దాడి చేసిన ఘటనలో వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగలిగడ్డతండాలో శాంతి అనే మహిళపై ఇదే తండాకు చెందిన భార్యాభర్తలు శారద, చందర్ దాడి చేశారు. శాంతికి తీవ్ర గాయాలు కావడంతో గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం చందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తేజం రెడ్డి తెలిపారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

ఇద్దరికి రిమాండ్

కొత్తూరు: ఓ బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నర్సింహ్మారావు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బీర్ల రమేశ్, గోద కృష్ణయ్య స్థానికంగా ఉండే 15 ఏళ్ల బాలికపై గత సోమవారం లైంగిక దాడికి యత్నించారు. వీరి చేష్టలకు భయపడిన బాలిక, బయటకు వచ్చి అరవడంతో పరారయ్యారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం సాయంత్రం వీరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు
- గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ఘటన


మృతి చెందిన వ్యక్తి

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం వెనకనుంచి ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలోని వినాయక స్టీల్ కూడలిలో జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరులోని బావర్చి హోటల్ పక్కన సిమెంట్ బ్రిక్స్ తయారు చేసే ఇద్దరు వ్యక్తులు బైకుపై షాద్‌నగర్ నుంచి కొత్తూరు వైపునకు వెళ్తున్నారు. వినాయక స్టీల్ కూడలి వద్ద వెనకాల నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుతో పాటు ఇద్దరు రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడ్డారు. ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.

బెట్టింగ్ భూతానికి యువకుడి బలి


రాహుల్ (ఫైల్)

మేడ్చల్ రూరల్: అప్పులు చేసి ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడగా..డబ్బులు పోవడంతో మనస్తాపంతో చెందిన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ యాదగిరి రెండో కుమారుడు రాహుల్ (24) ఇంటర్ వరకు చదివి ఓ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మద్యం తాగడం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన రాహుల్ అలియాస్ సన్నీ కొన్ని రోజులుగా అప్పులు చేసి ఐపీఎల్ బెట్టింగ్‌లో డబ్బులు పెట్టగా నష్టం వచ్చింది. దీంతో రూ.4 లక్షల వరకు అప్పులు అయ్యాయి. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన రాహుల్ సోమవారం రాత్రి ఇంట్లో పై పోర్షన్‌లోని తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కుటుంబీకులు మంగళవారం గమనించి కన్నీరుమున్నీరయ్యారు.

ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేద్దాం

- 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' థీమ్‌తో పోటీలు..
- మే 21 నుంచి 23 వరకు నిర్వహణ..

సనత్‌నగర్: జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' అనే థీమ్‌తో ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. నృత్యం, స్కిట్స్, పెయింటింగ్ అంశాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. మే 21న టీజీపీసీబీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెయింటింగ్, 22న నృత్య పోటీలు, 23న స్కిట్స్/ డ్రామా పోటీలు ఉంటాయన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను హైలెట్ చేసే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాల్సిందిగా పీసీబీ అధికారులు తెలిపారు. భూమి, నీరు, గాలి, ప్లాస్టిక్, కాలుష్య నియంత్రణతో పాటు ఎనర్జీ, నీటి సంరక్షణ, మొక్కలు పెంపకం ద్వారా పచ్చదనాన్ని పెంచడం వంటి ఇతివృత్తంతో ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు సనత్‌నగర్ టీజీపీసీబీ ప్రధాన కార్యాలయంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

తాండూరు రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు పోలీసులు అప్పగించారు. కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు నెలల నుంచి ఏడు ఫోన్లు పోగొట్టుకోవడంతో వారు ఫిర్యాదు చేశారు. దీంతో సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని గుర్తించారు. ఈ మేరకు బుధవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నగేష్, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొంపముంచిన ఫ్యాన్సీ పాస్‌వర్డ్

- సెల్‌ఫోన్ కొట్టేసి ఫోన్‌పేలో డబ్బులు కాజేసి
- నిందితుడి అరెస్ట్, పరారీలో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన సీఐ గంగాధర్


నిందితుడు కల్యాణ్

కడ్తాల్: మొబైల్‌కు ఫ్యాన్సీ నంబర్ పాస్‌వర్డ్ పెట్టుకోవడంతో ఓ అమాయకుడి ఖాతా గుల్లయిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సెల్‌ఫోన్‌ను కొట్టేసిన దుండగులు అందులోని ఫోన్‌పేలో డబ్బులు మాయం చేశారు. ఈ కేసును సాంకేతిక ఆధారాలతో పోలీసులు ఛేదించి నిందితుడిని కటకటాల పాలు చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో సీఐ గంగాధర్ కేసు వివరాలను వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన జురిగ సింహయ్య ఈనెల 9న హైదరాబాద్ వెళ్లేందుకు స్థానికంగా ఆర్టీసీ బస్సు ఎక్కాడు. అదే సమయంలో మాటువేసిన నగరంలోని మీర్‌పేట్ ప్రాంతానికి చెందిన మేకల కల్యాణ్ ఆయన జేబులోంచి సెల్‌ఫోన్‌ను కొట్టేశాడు. అనంతరం ఆవుల శ్రీను, వెంకటరమణమ్మ, రాకేశ్‌లతో కలిసి ఆటోలో పరారయ్యాడు. కొట్టేసిన సెల్‌ఫోన్ లాక్ తెలుసుకున్న వెంకటరమణమ్మ ఫోన్‌పే నుంచి రూ.82,600 ట్రాన్స్‌ఫర్ చేసుకొని వాటాలు పంచుకున్నారు. సింహయ్య ఈనెల 11న సెల్‌ఫోన్‌తో పాటు డబ్బులు పోగొట్టుకున్నట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నగదు బదిలీ అయినా ఖాతాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం మైసిగండి సమీపంలో నిందితుడు మేకల కల్యాణ్‌ను అరెస్ట్ చేసి, ఆటో, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం నిందితుడిని కోర్టులో హాజరు పరిచి, చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. అనుచరులు ఆవుల శ్రీను, వెంకటరమణమ్మ, రాకేశ్‌లు పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితులపై పలు ఠాణాల్లో కేసులు ఉన్నట్లు వివరించారు.

రోడ్డు పనులు అడ్డుకున్న వ్యక్తికి నోటీసులు


రోడ్డుకు అడ్డంగా పోసిన మట్టి

కేశంపేట: సీసీ రోడ్డు పనులు అడ్డుకున్న వ్యక్తికి అధికారులు నోటీసులు అందజేసిన ఘటన మండల పరిధిలోని సంగెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. 17 ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీ తీర్మానంతో గ్రామస్తులు సీసీ రోడ్డును వేశారు. కాలనుగుణంగా పాడైపోవడంతో పాత సీసీ రోడ్డు పైనే మళ్లీ కొత్త రోడ్డును వేసేందుకు గ్రామస్తులు ప్రయత్నించారు. 6వ వార్డు నుంచి వేములనర్వ వెళ్లేందుకు ఉన్న బీటీ రోడ్డుకు అనుకూలంగా సీసీ రహదారి ఉంటుంది. అయితే రెండు నెలల క్రితం గ్రామంలో ఈ వార్డు నుంచి రోడ్డు వేస్తుండగా పాత సీసీ రోడ్డు తన స్థలంలో ఉందని, మళ్లీ వేయడానికి వీల్లేదని గ్రామస్తులతో మహేందర్ తెలిపి పనులను అడ్డుకున్నాడు. వెంటనే గ్రామస్తులు విషయాన్ని మండల అధికారులకు తెలియజేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ద్వారా సీసీ రోడ్డు అడ్డుకున్న వ్యక్తిని నోటీసును అందించారు. గ్రామస్తులు బుధవారం మండల పరిషత్ అధికారితో పాటుగా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఏర్పుమళ్లలో మే 4న నిర్వహించే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘాల తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం రేగడిమైలారం, కొత్తూరులో గోడపత్రికలు విడుదల చేశారు. మహిళలు, యువకులు కమిటీలుగా ఏర్పడి ముందుకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండలాధ్యక్షుడు అంజిలప్ప, నాయకులు లక్ష్మయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ టీకాలు

కుల్కచర్ల: టీబీ హౌజ్ హోల్డ్ సభ్యులకు టీకాలు ఇచ్చామని కుల్కచర్ల వైద్యాధికారి కిరణ్ గౌడ్ చెప్పారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ కోఆర్డినేటర్ రాజు ఆధ్వర్యంలో వ్యాధిగ్రస్తులకు టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ వ్యాధిగ్రస్తులు ఉన్న ఇళ్లలోని ఇతర వ్యక్తులకు వ్యాధి సోకకుండా వారికి టీకాలు ఇచ్చామని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న ప్రతిఒక్కరూ టీకా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు మాధవి, మహేశ్వరి, టీబీ సూపర్‌వైజర్ గోపాల్, వైద్య సిబ్బంది సుజాత, సీనబాయి, నవీన్, సిరాజ్ పాల్గొన్నారు.

సుదీర్ఘ సేవలు అభినందనీయం


ఏఎస్‌ఐ ఎండీ హాషంను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: విధి నిర్వహణలో మనం ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ కార్యాలయంలో వికారాబాద్ మహిళ పీఎస్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఎండీ హాషంకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సుదీర్ఘంగా సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. 41 ఏళ్ల పాటు విధులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఏఓ జ్యోతిర్మణి, ఉమెన్స్ పీఎస్ సీఐ శివచంద్ర, ఆర్‌ఐలు, జిల్లా పోలీసు ప్రెసిడెంట్ అశోక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేవరయాంజల్‌కు హైడ్రా 'దారి' చూపింది!

- నేరుగా ఎన్‌హెచ్ నెం.44కు చేరుకునే అవకాశం
- కండ్లకోయ నివాసులకు ఉపయుక్తంగా రహదారి



సాక్షి, సిటీబ్యూరో: శామీర్‌పేట మండలంలోని దేవరయాంజల్, కండ్లకోయ ప్రజలు నేరుగా జాతీయ రహదారి నెం.44కు చేరుకునే అవకాశం హైడ్రా కల్పించింది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న రహదారిని రోడ్డుకు అడ్డంగా గేట్లు పెట్టి, కొంత మేర తవ్వి ఆటంకాలు సృష్టించారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న హైడ్రా బుధవారం ఆ అడ్డంకుల్ని తొలిగించింది. దేవరయాంజల్ విలేజికి ఉండే ప్రధాన రహదారిని మూసేశారంటూ స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. రోడ్డుకు అడ్డంగా గేట్లు పెట్టి రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తున్నారని నిర్ధారించుకుంది. కండ్లకోయ 135, 136 సర్వే నంబర్లలో జిల్లా న్యాయస్థాన సముదాయానికి కొంత స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. అలాగే ఇవే సర్వే నంబర్లలో మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మేడ్చల్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ నిర్మాణానికి కూడా కొంత స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణం జరగాల్సి ఉండగా ఇప్పటికే ఈ మార్గంలో కొన్ని పరిశ్రమలు కూడా ఉన్నాయి. వీటితో పాటు కండ్లకోయ – దేవరయాంజల్ నివాసితులు కూడా ఇదే రోడ్డును వినియోగిస్తున్నారు. ప్రస్తుతం మట్టి రోడ్డు ఉండగా త్వరలో 40 అడుగుల విస్తీర్ణంలో దాంబరు రోడ్డు నిర్మించేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బండకుంట నరసింహారెడ్డి అనే వ్యక్తి కబ్జా చేసి, రహదారిపై అడ్డంకులు సృష్టించడంపై స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత హైడ్రా అక్కడ నిర్మించిన గేట్లతో పాటు రోడ్డు మీద అడ్డంగా వేసిన బండరాళ్లను తొలగించింది. కందకం మాదిరి తవ్విన చోట మట్టిని నింపి రాకపోకలను పునరుద్ధరించింది. గూండాగిరితో రాకపోకలకు అంతరాయం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని హైడ్రాను స్థానికులు కోరారు. ఫిర్యాదు చేసిన వారం రోజుల్లోనే ఆటంకాలను తొలగించిన హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.